క్లుప్తంగా

ఏరో మోడలింగ్‌పై విద్యార్థులకు అవగాహన

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నిర్మలా ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఏరో మోడలింగ్‌పై అవగాహన సదస్సునిర్వహించారు. కార్యక్రమంలో డ్రోన్ ట్రైనర్ అశోక్‌కుమార్ పాల్గొని ఏరోప్లేన్ హెలీకాప్టర్, రాకెట్ తయారీ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లాలో మొదటిసారిగా విద్యార్థులకు ఏరో మోడలింగ్‌పై వినుకొండలో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డ్రోన్ టెక్నీషియన్ బి.చంద్రశేఖర్,ప్రిన్సిపల్ రాణి గోవింద్, లతోపాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో గంజాయి రవాణా ముఠా

పోలీసుల అదుపులో నిందితులు

ఈపూరు: మండల పరిధిలోని ముప్పాళ్ల గ్రామంలో మంగళవారం రాత్రి రెండుకేజీల గంజాయి విత్తనాలను సెబ్‌అధికారులు పట్టుకున్నారు. గంజాయి, విత్తనాలు విక్రయిస్తున్న ముఠా సభ్యులను పట్టుకున్న సెబ్ అధికారులు పూర్తి వివరాలను మీడియాకు తెలియజేయలేదు. ముఠా సభ్యులు కొంతమంది గతంలో గంజాయిరవాణా కేసులో శిక్ష అనుభవించినవారు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. పోలీసులు గంజాయి విత్తనాలు, స్వాధీనం చేసుని దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈవిషయమై సెబ్ ఎస్సై సైమన్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అధికారులు తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

558 లబ్ధిదారులకు వడ్డీరాయితీ

శావల్యాపురం: జగనన్న తోడు 6విడతలో భాగంగా సున్నా పథకం 558 లబ్ధిదారులకు లబ్ధి చేకూరినట్లు ఏపీయం జి.వాసుబాబు బుధవారం తెలిపారు. ఈసందర్భంగా స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో ఏపీయం మాట్లాడుతూ 264 మంది చిరు వ్యాపారులకు రూ. 26 లక్షల 41వేల రూపాయాలకు రుణ సదుపాయం వివిధ బ్యాంకులు కల్పించినట్లు చెప్పారు. ఇందుకుగాను రుణాలు సకాలంలో చెల్లించిన లబ్ధిదారులు 558 లబ్ధిదారులకు వడ్డీ రాయితీ నగదు రూ.ఒక లక్ష 26 వేల 368లు వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోకి ప్రభుత్వం నగదు జమ చేసిందన్నారు. ఆయనతో పాటు సీసీలు బేబిరాణి, రమాదేవి, ఖాజావలీ, యానిమేటర్లు, వివో ఎలు తదితరులు ఉన్నారు.

సైట్ సూపర్‌వైజర్ల పోస్ట్‌కు ఉచిత శిక్షణ

నరసరావుపేట ఈస్ట్: నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పించేదానిలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోటప్పకొండలోని ఎస్ఆర్‌టీపీ-టీటీడీసీ కేంద్రంలో సైట్ సూపర్‌వైజర్ ఈహెచ్ఎస్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్.బాజీబాబు బుధవారం తెలిపారు. బీటెక్, పాలిటెక్నిక్ (సివిల్) ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తిగల వారు వి.మణికంఠగోపాల్ 9346890335 సంప్రదించాలని తెలిపారు.

సంతగుడిపాడులో వైద్య బృందం పర్యటన

రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు గ్రామంలో బుధవారం వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య బృందం పర్యటించింది. సంతగుడిపాడు గ్రామంలో డెంగ్యూ కేసు ఉన్న ఇంటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా మలేరియా వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ బి. మురళి, ఎస్.వి.ఓ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ అబ్దుల్ రహమాన్, ఎఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

చిలకలూరిపేటటౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని సుబ్బయ్యతోట యూత్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెప్పారు. చనిపోయిన తమ మిత్రుల జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను చిలకలూరిపేట విద్యాసంఘం అధ్యక్షుడు తేళ్ల సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకొనివాటిని పాటించాలని కోరారు. ఈ పోటీలు బుధవారం నుండి ఈ నెల 15 వతేదీ వరకు జరుగుతాయన్నారు. ఈ టోర్నమెంటుకు 50 టీంలు పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు టి వినయకుమార్, సుధాకర్, శ్రీనివాసరావు, వెంకటేష్, కె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి సారె సమర్పణ

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలో వేంచేసియున్న శ్రీలీలా వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసంను పురస్కరించుకొని శ్రీగోదాదేవి అమ్మవారికి మహిళలు బుధవారం సారె సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.పి.రంగారావు ఆధ్వర్యంలో 108మంది మహిళలు సారెతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి సారెను అందించారు. గోదాదేవి అలంకరణలతో కొనసాగిన ఊరేగింపు భక్తులను అలరించింది.

ప్రతి ఒక్కరికీ జగనన్న పాలనలో మేలు

- అందరికీ ఉచిత వైద్యం, విద్య, ఇళ్ల నిర్మాణాలు
- వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని


పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: కార్మికులు, కర్షకులు, చేనేతలు, చేతివృత్తుల వారు ఇలా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేలా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖమంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 32వ వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదని చెప్పారు. పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని వివరించారు. ఏ కుటుంబమైనా అభివృద్ధి చెందాలంటే ఆ ఇంటిలోని భావిపౌరులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఇంగ్లిషు మీడియం, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. దీనికి తోడు వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీని దాదాపు అన్ని వ్యాధులకు వర్తింప చేస్తున్నామన్నారు. రూ. 16వేల కోట్లతో గ్రామ స్థాయిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నుంచి మెడికల్ కళాశాలల నిర్మాణం వరకు ఎంతో పకడ్బందీగా చేపడుతున్నామని వివరించారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అందరికీ ఇళ్లు, జగనన్న కాలనీలు నిర్మిస్తోందని పేర్కొన్నారు. జగనన్న కాలనీలలో పేదవారి సొంతింటి కలలు సాకారం ఆవుతాయని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం ఎంతో చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం పథకాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని,వార్డు కౌన్సిలర్ బిత్రా రాజేంద్రప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్నా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు కసనానాయక్, ప్రగడ రామకోటేశ్వరరావు, పాలడుగు శివపార్వతి, అవ్వారు అన్నపశెట్టి, ఊట్ల సాంబమూర్తి, ప్రగడ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదో వార్డుకు రూ.7.5 కోట్ల సంక్షేమ ఫలాలు

- ఇస్లాంపేటలో గడప గడపలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- వార్డులో 430 మందికి ఇళ్లపట్టాలు
- ఘనంగా స్వాగతం పలికిన మైనార్టీలు


సంక్షేమ పథకాల వివరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: పట్టణంలోని ఎనిమిదవ వార్డులోని ప్రజలకు గత మూడున్నరేళ్ల కాలంలో రూ.7.5 కోట్ల విలువైన సంక్షేమ ఫలాలు అందించామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి ఎనిమిదవ వార్డు ఇస్లాంపేటలో పర్యటించారు. పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యేకు వార్డు నాయకులు షేక్ కరిముల్లా, షేక్ ఖాజా, మాజీ కౌన్సిలర్ అబ్దుల్ సత్తార్, షేక్ రబ్బాని, ఫాతిమూన్ ఆధ్వర్యంలో మైనార్టీసోదరులు ఘన స్వాగతం పలికారు. పలుచోట్ల మహిళలు, నాయకులు కేకులు కట్ చేయించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఇప్పటివరకు ప్రతి గృహానికి అందుతున్న సంక్షేమ పథకాలను గురించి తెలియచేస్తూ వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. వారు చెబుతున్న సమస్యలను వింటూ వారి మనోభావాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, జగనన్న తోడు, వసతి దీవెనతో పాటుగా 27 పథకాలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. కరోనా కష్టకాలంలో ప్రపంచంతో పాటు మనదేశం మొత్తం ఇబ్బందిపడుతున్నా రాష్ట్రంలోని ప్రజలు మాత్రం సీఎం జగన్ అమలుచేసిన సంక్షేమ పథకాలతో ఆదుకున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో సుమారు రూ.2 లక్షల కోట్ల పథకాలను అందించిన ప్రభుత్వం మరోకటిలేదన్నారు. నాడు-నేడు కింద ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్ది ప్రజలకు మెరుగైన విద్యను అందిస్తున్నారన్నారు. పట్టణంలో ఏ వార్డులో లేని విధంగా 430 మందికి ఇళ్ల పట్టాలు అందించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఓ.శ్రీనివాసరావు, ఏఈ స్వర్ణరాజు, విద్యుత్‌శాఖ ఏఇ సురేంద్ర బాబు, షేక్ కార్పోరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్.ఏ.హనీఫ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి రమేష్, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి జి.గాబ్రియేలు, జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రా, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఖాదర్‌బాష, మాజీ కౌన్సిలర్లు చల్లా శ్రీను, మాగులూరి రమణారెడ్డి, బత్తుల లక్ష్మీపద్మలత, నాయకులు మద్దిరెడ్డి నరసింహారెడ్డి, సయ్యద్ ఖాదర్‌బాష పాల్గొన్నారు.

కూడార్రై ఉత్సవం



వినుకొండ పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లో గల శ్రీ చిన్నజీయరు స్వామి నిలయంనందు సంక్రాంతి ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా కూడార్రై ఉత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. శ్రీ కృష్ణుడికి 108 గంగాళాలతో పాయసం, 108 గంగాళాల వెన్నతో నివేదన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో కోలాహలంగా ఊరేగించారు. నిలయం నిర్వాహకురాలు మల్లికాప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ధనుర్మాస ఉత్సవాలను ఘనం నిర్వహించడం జరిగిందన్నారు.

– వినుకొండ(నూజెండ్ల)

తుది దశకు..



మండలం కేంద్రం నూజెండ్ల గ్రామం నుంచి పలు గ్రామాలను అనుసంధానం చేసుకుంటూ నూతన రహదారి పనులు జరుగుతున్నాయని ఆర్అండ్‌బీ ఏఈఈ కంచెటి నవ్య బుధవారం తెలిపారు. నూజెండ్ల గ్రామం పరిధిలో అప్పాపురం, మారెళ్లవారిపాలెం, తలార్లపల్లె, దాట్లవారిపాలెం, కమ్మవారిపాలెం,రెడ్డిపాలెం వరకు 17 కిలోమీటర్ల 200 మీటర్ల వరకు రూ. 4 కోట్ల వ్యయంతో పనులు పారదర్శకంగా జరుగుతున్నాయన్నాయని, పనుల తుదిదశకు చేరినట్లు ఏఈఈ తెలిపారు.

– వినుకొండ (నూజెండ్ల)

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేటటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా గురువారం పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కళామందిర్‌సెంటర్, గడియారస్థంబం సెంటర్, కూరగాయలమార్కెట్ రోడ్డు, గాంధీపార్కు రోడ్డు, తహశీల్దార్ కార్యాలయం రోడ్డు ప్రాంతాలలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.

14న స్టేడియంలో ముగ్గుల పోటీలు

నరసరావుపేట: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈనెల 14వ తేదీ ఉదయం 9గంటలకు సత్తెనపల్లి రోడ్డులోని స్టేడియంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీ నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి బుధవారం వెల్లడించారు. మొదటి బహుమతిగా రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు, మూడవ బహుమతి రూ.2 వేలు, రూ.1000లు కన్సోలేషన్ బహుమతులు ఐదుగురికి ఇవ్వబడతాయన్నారు. ఆసక్తిగల వారు 13వ తేదీ సాయంత్రంలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అంజనాదేవి-92473 90433, శ్రీ ఇందిరా శాస్త్రి-63029 98048, రాజేశ్వరి-96033 76312, ఖాన్-99086 63536లకు వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

శావల్యాపురంలో అవగాహన సదస్సు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో నాబార్డు సహకారంతో గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వారి సారథ్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా స్వయ సహాయక మహిళా సభ్యులు బ్యాంకు పొదుపు ఖాతాలు, సొసైటీ బ్యాంకు సేవలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఉపయోగాలు, సైబరు నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏటీయం వినియోగం ద్వారా ఉపయోగాలను టీవీ, కళాకారుల ద్వారా వివరించారు. విద్య ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు, సిబ్బంది ఎస్ సతీష్, రామాంజనేయులు కళాజాతర టీం సభ్యులు మల్లిఖార్జున, శివా పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు, విభజన హామీలను నెరవేర్చాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి చేపట్టనున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని కోరారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం సాయంత్రం బస్సు యాత్ర విజయవంతం చేయాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సుభానీ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన హిందూపురం నుంచి బస్సు యాత్ర ప్రారంభమై ఫిబ్రవరి 4వతేదీన ఇచ్ఛాపురంలో ముగుస్తుందని తెలిపారు.

విధుల్లో అలసత్వం చూపకండి

శావల్యాపురం: ఉపాధి సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ ఆసిస్టెంట్స్‌లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి అధికారుల సూచనలు మేరకు పనులు చేయాలని తద్వారా కూలీల వేతనం రూ. 250లు తగ్గకుండా ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు.

సంస్కృతీ-సంప్రదాయ ప్రతీకలు పండుగలు


చిలకలూరిపేటలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు


భోగిమంటలను ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్ కోటేశ్వరరావు, కార్యదర్శి రమేష్‌బాబు

చిలకలూరిపేట: మన సంస్కృతి, సాంప్రదాయాలకు పండుగలు అద్దం పడతాయని ఎంసీఆర్ మున్సిపల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం కె.సుధ చెప్పారు. పాఠశాలలో సంక్రాంతి సంబరాలను బుధవారం నిర్వహించారు. చిన్నారులు హరిదాసు కీర్తనలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోగి పండ్లు పోసి ఆశీస్సులు అందించారు. పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రాంగణంలో ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. పంటలు ఇంటికి వచ్చే వేళ కొత్త బియ్యంతో వండిన పాయసం, అరిసెలు, చక్రాలు పిండి వంటల గురించి ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోటు శ్రీనివాసరావు, ఎ.నీలిమ, టి.కుమారి, విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్ఈసీలో సంక్రాంతి సంబరాలు

నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీ, త్రీడి ఆర్ట్ డ్రాయింగ్ కాంపిటేషన్, ఫ్యాషన్ డ్రస్ కాంపిటేషన్ నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌లు బోగిమంటలు వేసి సంబరాలను ప్రారంభించారు. సంస్కృతిని ప్రతిబింబించేలా హరిదాసుకీర్తనలు, కొత్తబియ్యం పొంగలిని తయారు చేశారు. అనంతరం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా సమరయోధుడు ఓబన్న జయంతి


వడ్డే ఓబన్న కటౌట్‌కు నివాళులు అర్పిస్తున్న బీసీ నాయకులు

నరసరావుపేట: స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 216వ జయంతి సందర్భంగా బుధవారం నరసరావుపేట పెద్ద చెరువులోని ఒడియ రాజుల సమక్షంలో ఘనంగా జయంతి కార్యక్రమం నిర్వహించారు. వడ్డే ఓబన్న పెద్ద కటౌట్‌కు పూలు చల్లి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వడ్డెర వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ వేముల శివ, వైఎస్సార్ సీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు అచ్చిశివకోటి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ పూర్ణచంద్రరావు, బీసీ సంక్షేమ సంఘ నాయకులు బత్తుల వెంకటేష్, తురక నాగులుమీరా, వేములరాజు, మంజుల మణి, మాజీ కౌన్సిలర్ చల్లా శీను, చాపల శీను, వేముల సత్యనారాయణ, వేముల పాండు, వేమవరపు శ్రీనివాసరావు, కుంచాల సురేష్, బత్తులశివయ్య, బత్తులసంజయ్, కుంచాల వీరయ్య పాల్గొన్నారు.

పేటలో..

నరసరావుపేట ఈస్ట్: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న 216వ జయంతి వేడుకలను బుధవారం పెద్దచెరువులోని వడ్డేర కమ్యూనిటీ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఏపీ సమైఖ్య వడ్డెర సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వడ్డెర సంఘం ప్రతినిధులు పాల్గొని ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎండీఓ దేవళ్ల వెంకటేశ్వరరావు, తన్నీరు రాయల్‌బాబు, బత్తుల శివయ్య, అచ్చి శివకోటి తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూములు పరిశీలించిన ఏడీఏ


భూముల వివరాలను పరిశీలిస్తున్న ఏడీఏ నాగశేఖర్

ఈపూరు: మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామంలో గల సర్వే నెం. 3లో గల వివాదాస్పద భూములను ఏడీఏ నాగశేఖర్ బుధవారం పరిశీలించారు. మొత్తం 90 ఎకరాల 40 సెంట్లల్లోని భూమికి సంబంధించి కొందరు తమకు పాస్ పుస్తకాలు ఉన్నాయని, మరి కొందరు తమకే పాస్‌పుస్తకాలు ఉన్నాయని స్పందనలో ఫిర్యాదు చేయడంతో ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ భూములను ఆయన పరిశీలించారు. స్థానిక మండల సర్వేయర్ చండీరాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీసర్వేలో ఈ భూముల వివరాలను, హద్దులను నమోదు చేయాల్సి ఉండగా అందులో భాగంగా కొందరు భూములు తమదనే వివాదం చెలరేగింది. ఈ సందర్భంగా ఏడీఏ నాగశేఖర్ మాట్లాడుతూ భూమిని పరిశీలించామని, సంక్రాంతి పండుగ అనంతరం మిగతా సర్వే పూర్తి చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

చదువును మించిన ఐశ్వర్యం లేదు

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, వై.సత్యనారాయణ

నరసరావుపేట ఈస్ట్: చదువును మించిన ఐశ్వర్యం మరొకటి లేదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థి విద్య ఆలంబనగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గత ఐదు సంవత్సరాలుగా బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు, ఈ ఏడాది ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన 13 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల రిటైర్డ్ వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి వై.సత్యనారాయణ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ, విద్య విలువను గుర్తించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి అధిక మొత్తంలో నిధులు కేటాయించటంతోపాటు విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టి.రవికాంత్, ఎం.సులేఖ, రిటైర్డ్ అధ్యాపకులు వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

పల్నాడు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ బి.సంపత్ బాబు


జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సంపత్‌బాబును సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

యడ్లపాడు: అన్ని ఉపాధ్యాయ సంఘాల సమన్వయం.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం దిశగా పని చేస్తానని పల్నాడు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ బి.సంపత్‌బాబు చెప్పారు. మండలం కేంద్రమైన యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాలలో బుధవారం పలు ఉపాధ్యాయ సంఘ నాయకులతో సమావేశం జరిగింది. ఎంఈవో అబ్బురాజు శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో చైర్మన్‌తో పాటు పలు ఉపాధ్యాయ సంఘ నాయకులు, హెచ్ఎంలు ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఆయా సమస్యలను ఐక్య పోరాటాలతోనే సాధించుకోవాలని తీర్మానించారు. అనంతరం నూతనంగా జిల్లా ఫ్యాప్టో చైర్మన్‌గా ఎన్నికైన సంపత్‌బాబును ఉపాధ్యాయ సంఘ మండల నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ వెంకటేశ్వర గుప్తా, హక్, కోటేశ్వరరావు, యూటీఎఫ్ చింతయ్య, ఈసా, చాంద్‌బాషా, ఏపీటీఎఫ్ పి.వెంకటరెడ్డి, రాజా, పీఆర్‌టీయూ సంపూర్ణరావు, బీటీఏ అప్పలరాజు, ఏపీటీజీ పద్మలత, బీమారావు, పాల్గొన్నారు.

జగనన్న తోడుతో ముందే సంక్రాంతి


చెక్కు అందజేస్తున్న ఎంపీపీ శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు సుధారాణి

చిలకలూరిపేట: జగనన్న తోడుతో చిరువ్యాపారులకు సంక్రాంతి పండుగ ముందుగానే వచ్చిందని ఎంపీపీ దేవినేని శంకరరావు చెప్పారు. ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న తోడు నమూనా చెక్కు పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సుదీర్ఘ పాదయాత్రలో చిరువ్యాపారుల కష్టాలను చూసి చలించి పోయిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వారికి మేలు చేసేలా జగనన్న తోడు కార్యక్రమం చేపట్టారని చెప్పారు.
మండల పరిధిలో జగనన్న తోడు ఆరో విడత కింద 337 మంది లబ్ధిదారులకు రూ. 33.70 లక్షలు అందజేస్తున్నట్లు చెప్పారు. అలాగే వడ్డీ రాయితీ కింద 1032 మందికి రూ.2.15 లక్షలు వారి ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి మాట్లాడుతూ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందజేస్తూ చిరు వ్యాపారులకు అండగా ఉంటున్నదని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.హేమలతాదేవి, ఏపీఎం ఫణిబాబు, సీసీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి ఇన్నర్‌వీల్ కృషి

చిలకలూరిపేట: మహిళల అభ్యున్నతికి ఇన్నర్‌వీల్ క్లబ్ కృషి చేస్తుందని క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కోలా విజయలక్ష్మి చెప్పారు. ఇంటర్నేషనల్ ఇన్నర్‌వీల్ డే ను పురస్కరించుకుని పట్టణంలోని మంజూ నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ గట్టు రంగారావు సహకారంతో 100 మహిళా పారిశుద్ధ్య కార్మికులకు చీరెలను బుధవారం పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు కోవిడ్ కష్టకాలంలో అందించిన సేవలు ఎంతో విలువైనవని చెప్పారు. స్నేహం, సేవా దృక్పథం అనే అంశాల అధారంగా ఇన్నర్‌వీల్ క్లబ్ పనిచేస్తుందని వెల్లడించారు. డాక్టర్ గట్టు రంగారావు మాట్లాడుతూ క్లబ్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి, గట్టు సరోజిని, పి.పద్మావతి, ఎం.ఇందిరా, ఎ.రమాదేవి పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com